# మమత



కళ్యాణ చక్రవర్తి

"రాణీ!—" ఆప్యాయంగా పిల్చాను.

ఎక్కడా జవాబులేదు....అలికిడే లేదసలు. ఓహో, అలక పాన్పు నధిరోహించి వుండా లీవిడ! ఔను మరి, ఎంత ఘట్టు తారీఖైతే మాత్రం, సినిమా ప్రోగ్రామనుకున్న తర్వాత —నే నేడింటికి వస్తే ఎలా? ఐనా, నే నెవరితో, ఏమేం మాట్లాడవలసి వచ్చిందో చెపితే, కోపం మాటేమైనా, ముందు ఏడుపు మొఖం పెడ్తుంది. ఔనూ, ఏం చెయ్యాలి వాళ్ల సంగతి?—ప్చ్, తోసిపారేస్తే, సరి!

"రాణీ!" మళ్లా పిల్చాను, బట్టలు మార్చుకుంటూ! కోపమొస్తే తనెంత అందంగా ఉంటుందనీ! అసలే ఎఱ్ఱటి బుగ్గలు మరింత కంది—అరుణోదయ సూర్యుణ్ణి గుర్తుతెస్తే, ధనుస్సులా వంగిన ఆ పెదాలు మరింత ముడుచుకుని అందాల్ని విరజిమ్ముతూంటే, నును వెచ్చటి చెక్కిళ్ళపై ముద్దుల వర్షం కురిపించేసి, కౌగిట్లో చిక్కించుకొని, నవ్వించడ మెంతసేపు? గువ్వలా నాలో ఒదిగిపోయి, సన్నని చేతుల్తో నా మెడ బంధించి ప్రపంచంలోని శక్తులన్నింటినీ స్వంతం చేసుకున్న దానిలా, తన మెరిసే కళ్ళతో గర్వంగా నన్ను చూస్తూ వుంటే—మరి నాకు వేరే స్వర్గ మెందుకు?

ఐనా, రాణి నా యింట్లో అడుగుపెట్టిన యీ సంవత్సరంలోనూ, మూతి ముడిచింది నాలుగైదు సార్లే! ఫలానిది కోరిందని నాకు తెలిసిన మరుక్షణ మవి ప్రత్యక్షమై పోతుంటే, ఇక పాపం కోపానికి తావెక్కడ?

"అయ్యగోరూ!" అంటూ లోపల్నించి వచ్చింది సుబ్బమ్మ కాఫీ కప్పుతో.

"రాణీ ఏది?" అన్నా, మామూలుగా కప్పు అందుకొంటూ.

"ఇందాకటేల మెట్లమీంచి దిగొత్తా పట్టు జారిపడిపోయినారు బాబూ! లగెత్తుకెళ్ళి పట్టుకొంటే, తలకేటి తగల్నేదు గానీండి, ఎడం బుజానికీ కడ్డి గుచ్చుకొంది, బాబూ. ఓటే రక్తం!...."

ఆతృతతో వింటున్న నాకు ఒళ్ళుమండింది —నాకు ఫోన్ చెయ్యనందుకు. ఆ మాటే అడిగాను.

"ఫోను చేపిస్తే, తమరు బైల్దేరారని అమ్మగోరు పడుకుంటే—మీక్కాఫీ ఎడదా తెల్సింది. డాట్రు బాబు యిప్పుడే ఎల్లినారు. మని వచ్చా—" అంది.

రెండంగల్లో పైకిచేరాను. 'రాణీ!' మెల్లిగా చెవిలో పిలిచాను. బాధగా మూల్గి పక్కకు తిరిగి పడుకుంది. ఆ అందమైన ముఖం బాధతో ముకుళించుకునుంటే, నా గుండె చెఱువైంది. ఎడం భుజంపైన జాకెట్టు గూడా ఎఱ్ఱగా తడిసింది. అసలే దెబ్బ తగిలితే—ఒరుసుకుంటూ యింకా యిదెందుకో! నాకు చిరాకేసింది. మెల్లిగా ముందువైపు గుండీలు విప్పి, భుజంపైనుండి గుడ్డ తప్పించాను.

కళ్ళెత్తి నావైపు చూసింది. నీళ్ళు గిఱ్ఱున తిరిగాయి. గబుక్కున తలను ఒళ్ళోకిలాక్కుని, వీపు నిమురుతూ ఓదార్చాను.

"భగవాన్! నాపై నీ కసి తీరలేదాయింకా?"

బుగ్గలపై కన్నీళ్ళ చారికలు కడ్తూండగా అలానే నిద్రలోకి జారింది రాణి.

కాఫీ పైకితీసుకొచ్చిన సుబ్బమ్మ, నా సైగతో టేబిల్‌పై పెట్టి—అడిగింది నెమ్మదిగా—"వంటకేం చెయ్యమంటార"ని.

ఎఱ్ఱగా చూశానామె వంక!

"రాణీ తోడు లేకండా ఎప్పుడైనా భోంచేశానా సుబ్బమ్మా? ఈ పూటకేం అక్కర్లేదు గానీ, హార్లిక్స్ కలిపి, ఫ్లాస్కులో తెచ్చిపెట్టి, నువ్వెళ్ళు!" అన్నాను.

రాణీ వచ్చింది మొదలు రెండో కంచం అవసరమే లేకపోయింది మాకు. కొత్తలో గునిసేది, కానీ రానురాను, నోటి కందించగానే కటుక్కున కొరికేది. వాడిపన్ను నా చేతిలోకి దిగినా, ఆ ముత్యాల పలువరుస అందం చూసి ముగ్ధుణ్ణయ్యేవాణ్ణి.

ఠంగ్! ఠంగ్!....అప్పుడే తొమ్మిది!

చిన్నగా రాణీతల పక్కకి దించి లేచాను. ఫాన్ ఆపుచేసి, కిటికీలు తెరిచాను. చల్లటి గాలి రివ్వున మేను తాకింది. వెండి వెన్నెల ఒంటి నిండా పులుముకొని చంద్రుడప్పుడే బయల్దేరాడు వేటకి. ముఖం తిప్పుకొని నీరసంగావచ్చి కూలబడ్డాను. ఎదురుగా కాన్వాస్‌పై జానకి! రూపు రేఖలు అసంపూర్తిగా మిగిలిపోయిన, నా—కాదు కాదు, ఆ—జానకి నవ్వుతోంది హేళనగా!

ఎంత నిర్దయ? ఎందుకు జానీ నా పై నీ కింతకసి? నేను నీకేం లోటుచేశానని చెప్పు జానకీ, నా కింత శిక్ష విధించావ్! చెయ్యని నేరానికి నన్ను బాధ్యుడిగాజేసి, నువ్వు మాత్రం సుఖంవెదుక్కుంటూ వెళ్ళావు. పోనీలే, నువ్వు రఘు వద్దనైనా సుఖంగావుంటే నా కంతేచాలు. నువ్వేం చేసినా నాకు కోపంలేదు జానకీ! కానీ విధితో కలిసి మాత్రం నన్నిలా అవహేళన చెయ్యకు. ఏమంటావా, చూడు. యిదిగో నా రాణిని చూడు. విధిపై నే చేసినతిరుగుబాటుకు ఫలితం యీ నా అందాల బొమ్మ. ప్రేమలోనూ, అందంలోనూ నిన్నే మించిపోయిన దీ రాణి.

నీలాగ నన్నువిడిచిపెట్టి వెళ్ళదనుకొన్నానే! నీ వల్ల తగిలిన దెబ్బకి ఎండిపోయిన నా జీవనాడుల్ని మళ్ళీ నా రాణికోసం రక్తంతో నింపుకున్నానే. ఈ రాణికూడా నన్ను మోసగిస్తుందా! భగవాన్! ఎటువంటి మాట వినాలిసొచ్చింది ఈవేళ! నే విన్నది అబద్ధమని చెప్పలేవా?...ఈ రెండో దెబ్బకి నేను తట్టుకోగలనా?...."

తల విదిల్చాను. రాణీ కదిలింది. ఆతృతగా దగ్గర కెళ్ళాను. చిన్నగా కళ్ళు తెరిచింది. ఒక్క పూటలో ఎంత నీరసపడి పోయింది? అందమైన వాళ్ళ నింత బలహీనంగా ఎందుకు చేస్తాడో దేవుడు?

ఫ్లాస్కులోంచి గ్లాసులోపోశాను హార్లిక్స్. మెల్లిగా లేవనెత్తి, గుండెలకి హత్తుకొని తాగించాను. 'నీకో!' అన్నట్టు చూసింది. ఆ చూపులోని ఆప్యాయతకి, ప్రాణాన్నొడ్డమన్నా, నిస్సంశయంగా యిచ్చేస్తాను.

మెల్లిగా పడుకోబెట్టి, జుట్టు నిమురుతూ అడిగాను 'నొప్పిగా వుందా!' అని. లేదన్నట్టు తలాడించింది. ఏడుపు ఉప్పెనలా పొంగి వచ్చింది నాకు—ఇంత అందమైన రాణి—మూగదానిగా ఎందుకు సృష్టింపబడాలని! కరువుదీరా ఏడ్చాను—'నన్ను వదిలి వెళ్తావా!' అని. తల తడిసిపోయిన రాణిపైకి చూసి నవ్వింది నా బాధ నర్థం చేసుకున్నట్టు. అభయమిచ్చినట్టు నన్ను దగ్గరకి తీసుకుంది. 'చాలు, యీ కౌగిలి తప్ప మరేమీ నా కక్కర్లేదు!' క్రిందటి జన్మలో ఏదేశమేలిందో—యిప్పుడు నన్నలరించడానికి నా యింట్లో కాలూనింది. రాణిలేని నాబ్రతుక్కి సార్థకత ఏది?

మెల్లిగా లేచాను. కొద్దిగా టెంపరేచర్ తగిలినట్టుగా వుంది. తలంతా పగిలిపోతోంది.

ఇందాకటి బాధ తాలూకు చిహ్నాలేమీ రాణిలో యిప్పుడు కన్పడ్డంలేదు. ప్రశాంతంగా దేవకన్యలా నిదురిస్తోంది. రాత్రే వేళైనా మెలకువ వచ్చి, చేయి జాపితే—రాణి ఒళ్లు నా కందకపోతే—బ్రతగ్గలనా?

జానకి వెళ్ళిపోయిన తర్వాతెందరో చెప్పారు, 'యీ మూగపిల్ల నేం చేసుకుంటావ్ రా? హాయిగా మేంచూపిన సంబంధమొప్పుకో!' అని. ససేమిరా వీలుకాదన్నాను. ఔను నా బ్రతుకు పండించటానికా లేత పెదాలపైని చిరునవ్వొకటి చాలదూ?

ఆఫీసు వేళల్లో తప్ప—మిగిలిన కాలమంతా ఒకే గుండెగా, ఒక్క శరీరంగా గడపలేదూ మేమిద్దరమూనూ? అటువంటి రాణి నన్ను విడిచి వెళ్ళిపోతుందా?

వీల్లేదు....ఏమైనా సరే, వీల్లేదు;

ఎదురుగా స్టూల్‌పై కూర్చున్నాను. జానకి చిత్రంలాగే, నా జీవన చిత్రణమూ అసంపూర్తిగానే మిగిలిపోతుందా? సంవత్సరం తర్వాత కొత్త కాన్వాస్ తొడిగాను మళ్ళీ. తెల్లవారి సుబ్బమ్మవచ్చి పిలిచేంతవరకు తెలియనే తెలీదు రాత్రామె వెళ్ళిన సంగతి!

అమ్మయ్య! రాణీ లేచింది. వెన్నెల జల్లులా నవ్వింది నాకేసిచూసి. ఆనందంతో నా కళ్ళు చెమర్చాయి. గబగబావెళ్ళి నుదుటిపై ముద్దు పెట్టుకున్నాను. సుబ్బమ్మ తెచ్చిన బ్రష్‌తో మొఖం కడుక్కోగా, ఇద్దరం కాఫీ త్రాగాము.

ఈలోగా డాక్టరు వచ్చాడు. ఆశ్చర్యపోయాడు. రాణిలోని యింప్రూవ్‌మెంట్ చూసి! కట్టు మార్చాలంటే! రాణీని పడుకోమన్నాను. మెల్లిగా భుజంపైని ఆ కాస్తమేరా జాకెట్టు తొలగిస్తే, కొత్త కట్టు కట్టాడు, కొంచె మిబ్బందిగా! సిగ్గుతోటో, భయంతోటో అటు తిరిగి పడుకుంది. ఖంగారు పడే అవసరమేం లేదని చెప్పి వెళ్ళాడు డాక్టరు!

"చూడు రాణీ! నిన్న నీకేం తెచ్చానో!" ప్యాకెట్టిచ్చాను. రవ్వల నెక్లెసు మెడలో

నిండుగా అమరింది. అప్సరసలా మెరిసి పోతోంది నా రాణి!

ఫోన్ మోగింది. రిసీవర్ నెత్తిన నా మొఖం పాలిపోయింది.

"హలో!" అన్నాను నిర్జీవంగా! నాకు తెలుసు. అవతలి కంఠస్వరం, కాల సర్పంలా నన్ను వణికిస్తోంది. రిసీవర్ నా చేతిలోంచి జారిపోయింది.

ఎదురుగా రాణి! ఆందోళన నిండిన ముఖంతో చూస్తోంది నా వైపు. ఉద్వేగంతో హృదయానికి హత్తుకున్నా.

లాభంలేదు. నేనోడి పోతున్నా. ఈసారి కూడా విజయం పైవాడిదేనా! వాడు దేవుడు కాడు, రాక్షసుడు! లేకుంటే, ఎందుకీ చెలగాటాలు? ప్రతీకారేచ్ఛతో నా మనసు పరవళ్లు తొక్కుతోంది. నెమ్మదిగా రాణి చేతిని నా చేతిలో వేసుకొని క్రింద హాల్లోకి వెళ్ళాను. ఒకే సోఫాలో కూర్చున్నాం.

నిరీక్షిస్తున్నాను! ఆ భయంకర క్షణం కోసం నిరీక్షిస్తున్నాను. ఏమిటి నా కర్తవ్యం? స్వార్థమా? వివేకమా? దేన్ని పాటించాలి నేను?

పైట కాలింగ్ బెల్ మోగింది.

ఇద్దరు వ్యక్తులు వచ్చారు లోపలకు. నమస్కరించి కూర్చున్నారు. వాళ్ళ ముఖాల్లోనూ బాధే తాండవిస్తోంది. నాకు చటుక్కున గుర్తు కొచ్చింది- 'నా పాలిట యమదూతలైనా, వాళ్లూ మనుషులే కదా' అని!

నా ముఖం కొంచెం ప్రసన్నంగా మారి వుండాలి. అతను ప్రారంభించాడు- ఎంతో వినమ్రంగా! "చాలా థాంక్స్ రావుగారూ! విషయమంతా మీకు తెలుసు. ఇవిగో ఐదు వేలు! నా రాణీని నా కివ్వండి! చేసిన పొరపాటును దిద్దుకొనే అవకాశం నా కిప్పించండి!"

"చూడండి! పొరపాటనేది మనిషికి సహజం! డబ్బు జూపించి మళ్ళీ యింకో పొరబాటు చేయకండి. రాణికి కావలసినవి ప్రేమ, అనురాగం, ఆప్యాయత! అవి మీ దగ్గర కరువైయ్యే, నాలుగేళ్ళ క్రితం- మీ నుండి వేరైంది. పట్టిలోని మాణిక్యాన్ని గుర్తించి నా యింటికి తెచ్చుకొని నా దేవతగా మార్చుకున్నాను. నాపై ఆమె సర్వాధికారిణి! ఆమె యిష్టాని కిక్కడ తిరుగులేదు. మళ్ళా, యీనాటికి ఆమె తప్ప మీకు మరో దిక్కు లేదు. ఔనా! చూడండి బాబూ! ప్రయత్నించి చూడండి! మీ న్యాయందృష్ట్యా మీకుందని భావించే హక్కుని ఆధారంగా చేసుకొని చూడండి! ఆమె మీ వెంట వస్తే నిరభ్యంతరంగా తీసుకెళ్ళండి. ఇవిగో నా ఆస్తిపాస్తుల వివరాలు, వీటిపై ఆమె హక్కులు!"—వీలునామాలు విసిరేశాను.

ఆ వ్యక్తి తలవంచుకొన్నాడు.

విజయ గర్వంతో నేనే పొడిగించాను!

"నాకు తెలుసు మీకది సాధ్యంకాదని! ఏమమ్మా. భారత స్త్రీవిగదా! మీరైనా, ఆయన పాపాన్నడ్డుకోలేక పోయారన్నమాట! నేను మీ డబ్బుకోసం రాణిని తిరిగి యివ్వడంలేదు. కేవలం మనిషిని గాబట్టి. మీ దురదృష్టం యొక్క పరిణామాలు స్వానుభవంతో నే నూహించగలను గాబట్టే, స్వార్థాన్ని ప్రక్కకు నెట్టి, మానవత్వానికి రూపు దిద్దగల్గుతున్నాను. ఇదుగో మీ రాణి! బండబారిన నా హృదయాన్ని చిగురింప చేసిన తేజోమయి. ఈమె మాట్లాడలేని బొమ్మ! నిజమే! కానీ, సర్వ జగత్తునీ చైతన్య స్రవంతిగా మార్చగల లావణ్యం, ప్రేమాంబుధిలో ముంచెత్తగల దైవత్వం వున్నాయి- యీమెలో. మీరిదివరకు వీటిని గుర్తించలేకపోతే, ఇకనైనా కళ్ళు తెరవండి! వెళ్ళండి! రాణీ! నా నించి విడివడుతూంటే, నా ఆత్మ శరీరంలోంచి తప్పుకుంటున్నట్టుంటుంది; నాలో రక్త ప్రసరణ ఆగిపోతుంది. నా గుండెలోనుండి అగ్ని పర్వతాలు బ్రద్దలౌతాయి. తీసుకు వెళ్ళండి!"—అతి కష్టం మీద మాటల్ని పూర్తిచేసి, అయోమయంగా చూస్తున్న రాణిని- ఆఖరు సారిగా ముద్దు పెట్టుకొని- పైకి వచ్చేశాను పరిగెత్తుకుంటూ!

లాక్కుని తీసుకెళ్తున్నారేమో, తను రాననే మొరాయింపు విన్పిస్తోందిక్కడికిగూడా! "భగవాన్! నన్నీ క్షణమే నీలో ఐక్యం చేసుకో! రాణిని మాత్రం సుఖంగా వుండేట్లు దీవించు తండ్రీ!" భోరుమని కూలబడ్డాను.

ఎదురుగా రాణి ప్రతి రూపం-నవ్వుతోంది హేళనగా- 'ఇదేనా నీ ప్రేమ' అని విలపిస్తోంది- 'నన్నా కసాయివాళ్ళ చేతి కందిస్తావా!' అని.

నా నుండి విరక్తితో కూడిన నవ్వు వెలువడింది. వియోగంతో విలపిస్తున్న నాకు తానొక ఆశాకిరణమై దారి చూపింది. బ్రతుకుకు కొత్త అర్థాన్ని చెప్పింది.

ఏం జానకీ! నేను చేసింది మంచి పనేనా? నా అంత దురదృష్టవంతుడు మరొక డుండకూడదని అనుకొనే నేను-చేతులారా అతన్నా అవస్థ కెలా గురి చెయ్యను? మరో జానకి లేచి పోడానికీ, మరో కాపురం కూలద్రోయడానికీ, మరో బతు కెండిపోడానికీ, కారణ భూతుణ్ణెలా అవగలను?

తండ్రులుగా మే మిద్దరమూ యిక అసమర్థులమే. నాది దైవిక లోపమైతే; అతడిది యాక్సిడెంటు మూలంగా జరిగిన ఆపరేషన్ ఫలితం! ఏమైనా అప్పు దక్కర్లేదని విసిరి వేయబడ్డ మూగ పిల్లే- యిప్పుడు వారి దేవతైంది! నాకు మళ్ళా అనాధ శరణాలయం వెళ్ళే ధైర్యం లేదు!

ఏమ్మా రాణీ! ఈ నిర్భాగ్యుణ్ణి గుర్తుంచుకుంటా నా తల్లీ!

ఐదేళ్ళ రాణి ఎదురుగా జాకెట్, పరికిణలతో తృప్తిగా నవ్వుతోంది.

'నన్ను విడిచి ఎక్కడికి వెళ్ళింది? నాతోనే ఉంది!'

బాధ గుండెల్ని పిండుతున్నా, ఏదో తృప్తి నా అంతరాంతరాల్లో ఝరీ వేగంతో ప్రవహిస్తూనే వుంది.

